# ప్రాజెక్టులు నిండుగా.. యాసంగికి పండుగ

- సాగుకు ఢోకా లేదంటున్న రైతులు
- ఈ యేడాది 37,864 ఎకరాల్లో పంటలు
- గతేడాదికంటే 8,466 ఎకరాల్లో అదనం

## భారీ వర్షాలతో నిండుకుండల్లా జలవనరులు



నీటితో కళ కళ లాడుతున్న కుమ్రం భీం ప్రాజెక్టు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడగా చెరువులు, ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి. జలవనరుల్లో పూర్తిస్థాయి నీటి మట్టం ఉండగా, ఈ యాసంగి సాగుకు ఢోకా లేకుంటైంది. ఈసారి 37 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తుండగా, రైతాంగం సిద్ధమవుతున్నది.

### ప్రాజెక్టులు కళ కళ..

జిల్లాలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందించే ప్రధాన ప్రాజెక్టులైన కుమ్రం భీం, వట్టి వాగు, చెలిమెల(ఎన్‌టీఆర్ సాగర్) ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటితో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురువడంతో ప్రాజెక్టులు నిండుకున్నాయి. కుమ్రం భీం ప్రాజెక్టు కాలువల ద్వారా నీటి విడుదలను అధికారులు నిరంతరం కొనసాగిస్తుండడంతో దిగువ ప్రాంతాల పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతోంది. మొత్తంగా ఈ ప్రాజెక్టు ద్వారా 10 వేల ఎకరాలకు సాగు నీరు అందనున్నది. కాలువలు పూర్తి కాకపోయినా రైతులు కాలువల్లో మోటర్లు పెట్టుకొని పంటలకు సాగునీరు అందిస్తున్నారు. ఇక వట్టివాగు ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం కుడికాలువ ద్వారా 15 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ యాసంగిలో ఈ ప్రాజెక్టు నుంచి సుమారు 2 వేల ఎకరాలకు సాగు నీరు అందనున్నది. చెలిమెల వాగు ప్రాజెక్టుద్వారా యాసంగిలో 2 వేల ఎకరాల వరకు సాగునీరు అందనున్నది. వీటికి తోడుగా జిల్లాలోని 411 చెరువుల ద్వారా 8 వేల ఎకరాలకు సాగు నీరు అందనున్నది. ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యవసాయ విద్యుత్ మోటర్ల ద్వారా మరో 15 వేల ఎకరాలకు పైగా నీరు అందనున్నది.

### 37 వేల ఎకరాల్లో పంటలు

ఈ ఏడాది యాసంగిలో 37,864 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వరి 16400 ఎకరాలు, పెసర 1350 ఎకరాలు, జొన్న 7000, మొక్క జొన్న 1700, శనగ 6500, గోధుమ లు 1100, వేరుశనగ 260, ఇతర పంటలు 3554 ఎకరాలు సా గతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. యూరియా 3434 మెట్రిక్ టన్నులు, డీఏసీ 1743, పొటాష్ 1970, సూపర్ పాస్ఫేట్ 51, కాంప్లెక్స్ ఎరువులు 1380 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

### 8,466 ఎకరాలు పెరిగిన సాగు

జిల్లాలో గతేడాది 29,398 ఎకరాల్లో పంటలు వేయగా, ఈ ఏడాది 8,466 ఎకరాల్లో అదనంగా సాగు పెరిగింది. ప్రధానంగా వరిసాగు గతేడాది 13275 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది 16,400 ఎకరాలకు పెరిగింది. ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణతో పాటు 24 గంటల ఉచిత విద్యుత్‌తో రైతులు ఢోకా లేకుంట పంటలు వేసుకుంటున్నారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

- అదనపు కలెక్టర్ రాహుల్
- బెల్లంపల్లి గురుకులంలో జోనల్‌స్థాయి సైన్స్‌ఫెయిర్
- ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందజేత



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

బెల్లంపల్లి రూరల్, డిసెంబర్ 13 : ఉపాధ్యాయులు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా బోధన చేపట్టాలని, అప్పుడే గొప్ప సమాజం అవిష్కృతమవుతుందని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో జోనల్ స్థాయి సైన్స్‌ఫెయిర్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆరు అంశాల్లో ప్రదర్శించిన ప్రదర్శనలను తిలకించారు. ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఆరు ప్రదర్శనలు రాష్ట్ర స్థాయికి అర్హత సాధించినట్లు ఆర్సీవో కే.స్వరూపారాణి తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రదర్శనలను అదనపు కలెక్టర్ రాహుల్ ప్రత్యేకంగా పరిశీలించి గైడ్ టీచర్లను అభినందించారు. ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్,ఆసిఫాబాద్ కోఆర్డినేటర్లు సంగనభట్ల శ్రీనివాస్, పోలోజు బాలరాజు, ప్రిన్సిపాల్ సందన రాజ స్వరూప, వైస్ ప్రిన్సిపాల్ పబ్బతిరెడ్డి స్వరూప, రీజియన్ పరిధిలోని గురుకులాల ప్రిన్సిపాళ్లు ఐనాల సైదులు, ప్రేమరాణి, పచ్చల జ్యోతి, రమేశ్‌బాబు, ఊటూరి సంతోష్, శ్రీనాథ్, సంగీత, కళాశాల అధ్యాపక, ఉపాధ్యాయులు వేమిరెడ్డి పరమేశ్వరి, కంకణాల సమత, పర్వతాల మంజుల, రాంపల్లి దశరథరామ్, శారద, రంగ శారద, విజయ, స్వప్న, ఆత్రం అపర్ణ, వనజ, శ్రీలత పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్,ఆర్సీవో కే స్వరూపారాణి

# పత్తి రైతుకు నిరాశ

సీసీఐ కొనుగోళ్లు అస్తవ్యస్తం

- మార్కెటుయార్డులో సహకరించని సిబ్బంది
- నిర్వహణ లోపంతో రైతుల ఇక్కట్లు
- ప్రైవేటు వ్యాపారుల చేతికి పంట
- అందని మద్దతు ధర





మార్కెట్‌యార్డులో పత్తి వాహనాలు విక్రయానికి పోటీ పడి కదలలేని పరిస్థితి

ఆదిలాబాద్, డిసెంబరు 13 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో రైతులు వానకాలం సీజన్‌లో పత్తి పంటను ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లాలో నల్లరేగడి నేలలు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉండడం ఇందుకు కారణం. జిల్లాలో పత్తి సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుంది. దీంతో ఏటా జిల్లాలో ఈ పంట సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తున్నది. గతేడాది 3,83,251 ఎకరాల్లో రైతులు తెల్ల బంగారాన్ని పండించగా, ఈ ఏడాది 4,12,436 ఎకరాల్లో పంట వేశారు. జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఆధ్వర్యంలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సీజన్‌లో 28.87 లక్షల క్వింటాళ్ల పంట మార్కెట్ వస్తుందని అంచనా వేసిన అధికారులు ఆదిలాబాద్, బోథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, జైనథ్ పరిధిలో 11 సీసీఐ కేంద్రాల్లో ఆదిలాబాద్‌లో రెండు, బేల, ఇచ్చోడ, బోథ్, సొనాల, పొచ్చర, నేరడిగొండ, ఇంద్రవెల్లి, నార్నూర్‌లలో మద్దతు ధరతో పంటను సేకరించనున్నారు. గతేడాది క్వింటాలుకు రూ. 6380 ఉండగా ఈ ఏడాది రూ.640 పెంచి 7020తో కొనుగోలు చేస్తున్నారు.

### కొనుగోళ్లు అస్తవ్యస్తం

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు అస్తవ్యస్తంగా మారాయి. బుధవారం ఎడ్లబండ్ల మార్కెట్‌లో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు లేకపోవడంతో రైతులు వాహనాల ద్వారా పత్తి సేకరించే కాంటాల వద్దకు రావడంతో కొనుగోళ్లకు కొంతసేపు అంతరాయం కలిగింది. ఎడ్లబండ్లపై పత్తిని తీసుకువచ్చిన రైతులు ప్రైవేటు వ్యాపారులకు పంటను అమ్ముకోవాల్సి వచ్చింది. మద్దతు ధర క్వింటాలుకు రూ. 7020 ఉండగా ప్రైవేటు వ్యాపారులు రూ. 6700 కు మాత్రమే కొనుగోలు చేశారు. దీంతో రైతులు క్వింటాలుకు రూ.300 వరకు నష్టపోవాల్సి వచ్చింది. ఎడ్లబండ్లపై చిన్న రైతులు పత్తిని విక్రయించడానికి వస్తారు. వారికి సీసీఐ కొనుగోళ్లపై సిబ్బంది అవగాహన కల్పించకపోవడంతో నష్టపోతున్నారు. అధికారులు స్పందించి సీసీఐకి తాము పత్తిని అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### క్వింటాలుకు రూ.6700 మాత్రమే..



*నేను ఎడ్లబండిలో పత్తిని అమ్మడానికి ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు తెచ్చిన. ఇక్కడ సిబ్బంది సీసీఐ కొనుగోళ్లు లేవని చెప్పిన్రు. దీంతో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. పత్తిలో 8 శాతం తేమ ఉండగా క్వింటాలుకు రూ.6700కు అమ్మిన. ఇంతే తేమ శాతంతో సీసీఐకి అమ్ముకుంటే క్వింటాకు రూ.7020 వచ్చేది. బండి కాంటా చేస్తే 8.19 క్వింటాళ్లు వచ్చింది. క్వింటాలకు రూ.300 చొప్పున రూ. 2 వేల వరకు నష్టపోయిన. అధికారులు స్పందించి రైతులు నష్టపోకుండా చూడాలి.*

**- కాళిదాసు, రైతు అర్లి, ఆదిలాబాద్ రూరల్ మండలం**

# ఉట్నూర్‌లో ఐఎస్‌ఎల్

- ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలకు ఏర్పాట్లు
- రాష్ట్రస్థాయి క్రీడాసమరానికి శ్రీకారం
- వచ్చే నెల 17 నుంచి 20 వరకు నిర్వహణ
- ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- ఇప్పటికే అధికారులతో పీవో సమావేశం



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో బాజ్‌పాయి

ఉట్నూర్, డిసెంబర్ 13 : ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక గ్రామ స్థాయిలో క్రీడలకు ప్రాధాన్యత పెరిగిందతి. ఒకప్పుడు రాష్ట్రస్థాయి పోటీలు అంటే హైదరాబాద్ లాంటి పట్టణాల్లో మాత్రమే జరిగేవి. కానీ నేడు ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూర్ లాంటి పట్టణాలకు వచ్చేశాయి. ఏటా రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో సొసైటీ విద్యార్థుల కోసం ఇంటర్ సొసైటీ లీగ్(ఐఎస్‌ఎల్) పోటీలు నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ కేంద్రంలో వచ్చే నెల 17 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. దీని కోసం ఇప్పటికే ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆధ్వర్యంలో కసరత్తు ప్రారంభించారు. క్రీడల కోసం మైదానాలు, రానున్న క్రీడాకారుల సౌకర్యాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

### క్రీడలివే..

రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల మాదిరిగానే సొసైటీ లీగ్ నిర్వహించనున్నారు. ఆయా సొసైటీలు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించి తుది జట్లను ఎంపిక చేసి ఐసీఎల్‌కు పంపుతారు. ఇందులో హాకీ, ఖోఖో, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, ఆర్చరీ, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, అథ్లెటిక్స్ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తారు.

### 5 వేల మంది క్రీడాకారుల రాక

గురుకుల ఇంటర్ సొసైటీ లీగ్ ఈ సంవత్సరం ఉట్నూర్ ఐటీడీఏలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ తరపున నిర్వహిస్తున్నారు. దీని కోసం సుమారు రాష్ట్రంలోని 14, 17, 19 విభాగాల బాల, బాలికలు అన్ని సొసైటీల నుంచి 4 వేల మంది, అంపైర్లు, కోచ్‌లు, మేనేజర్లు, పీడీలు, పీఈటీలు మొత్తం కలిసి 5వేల మందికి పైగా రానున్నారు. దీంతో క్రీడాకారులకు అవసరమైన వేదికను పట్టణంలోని కుమ్రం భీం ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో క్రీడాకారులకు అవసమైన మైదానాలు, వసతులు ఏర్పాటు చేస్తున్నారు. కేబీ కాంప్లెక్స్‌లోని క్రీడా పాఠశాల, ఈఎంఆర్‌ఎస్ ప్రాంగణం, పూలాజీ బాబా ఉన్నత పాఠశాలల మైదానాల్లో ఈ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఈ పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు.

### పోటీలను విజయవంతం చేస్తాం



*ఏటా గురుకులాలల్లో ఇంటర్ సొసైటీ లీగ్‌లు నిర్వహిస్తారు. 7వ సారిలో భాగంగా ఉట్నూర్ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీకి కేటాయించారు. ఇది ఉమ్మడి జిల్లాకు కేటాయించడం మొదటి సారి. ఇందులో భాగంగా దీని నిర్వహణను ప్రభుత్వం ఐటీడీఏకు అందించింది. క్రీడలను విజయవంతంగా నిర్వహించేందుకు ఐటీడీఏ పీవో బాజ్‌పాయ్ ఇప్పటికే అధికారులతో మూడు సార్లు మీటింగ్ ఏర్పాటు చేసి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. గతంలో నిర్వహించిన అనుభవంతో క్రీడలను విజయవంతం చేస్తాం. ఐదు వేల మందికి సరిపడా ఏర్పాట్లు చేస్తున్నాం. ఐటీడీఏ ఆధ్వర్యంలో క్రీడలను ఘనంగా నిర్వహిస్తాం.* **- పార్థసారథి, జిల్లా గిరిజన క్రీడాధికారి, ఉట్నూర్**



క్రీడలను ప్రారంభిస్తున్న డీడీ(ఫైల్)



పోతరాజు ఆలయంలో కొలువైన భీమదేవతలు

# వేడుకలకు వెళ్దామా..

కెరమెరి, డిసెంబర్ 13 : మార్గశిర(సట్టి) మాసంలో భీమల్‌పేన్ వేడుకలు జరుపుకునేందుకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. బుధవారం నుంచి మార్గశిర మాసం ప్రారంభంకాగా.. భక్తిశ్రద్ధలతో సంస్కృతీ సంప్రదాయాల నడుమ జరుపుకోనున్నారు. దీపారాధన చేసి.. ఆపై భీమదేవుని ఉత్సవాలు నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు నిర్వాహకులు, పూజారులు నియమనిష్టలతో ఉండి దేవున్ని ఆరాదధిస్తారు. ఈ సందర్భంగా కొంత మంది భీమదేవుని స్వస్థలమైన కప్లె వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. దట్టమైన అడవి, ఎత్తైన గుట్టల మధ్య పవిత్ర పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన కప్లె, సిద్ధికస వేడుకలకు ప్రాముఖ్యత ఉన్నది. కొన్నేళ్ల క్రితం సహజసిద్ధంగా ఏర్పడ్డ సిద్ధికసలోని శివలింగం, భీమసేనుడు నివాసమున్న కప్లె గుహలను సందర్శించడం ఆనవాయితీగా వస్తున్నది. సట్టి(గోండి నెల) మాసంలో ఈ ప్రాంతాలు భక్తుల తాకిడితో సందడిగా మారుతాయి. తెలంగాణతో పాటు మహారాష్ట్రల నుంచి భక్తులు దైవ దర్శనానికి అధిక సంఖ్యలో తరలివస్తూ వైభవంగా వేడుకలను జరుపుకుంటారు.

### సిద్ధికసలో ప్రత్యక్షమైన శివలింగం

కరంజివాడ గ్రామ పంచాయతీ పరిధిలోని శంకర్‌లొద్ది గ్రామ సమీపంలో గల సిద్దికస అటవీప్రాంతంలో ఓ రాతికొండ ఉంది. ఆ కొండ మధ్య భాగంలో చిన్న సొరంగంలా ఏర్పడి అందులో సహజసిద్ధంగా శివలింగం ప్రత్యక్షమైంది. గతంలో శివపార్వతులు ఈ ప్రాంతంలో నివాసమున్నారనే భక్తుల విశ్వాసం. అందుకే ఇది ఎంతో మహిమలు కలదని, కోరిన కోరికలు తీర్చే పుణ్యస్థలంగా భక్తులు నమ్ముతారు. శివలింగం పక్కన జీవనదిలా ఓ వాగు ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. భక్తులు ముందుగా ఇందులో స్నానాలు ఆచరించిన తర్వాత శివలింగాన్ని దర్శించుకుంటారు.



భీమదేవుడు నివాసమున్న గుహ ముఖద్వారం

### భీమదేవుని నివాస ప్రాంతం కప్లె గుహ

శంకర్‌లొద్ది గ్రామం నుంచి సుమారు 3 కిలో మీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో కప్లె గుహ ఉంది. పాండవులు అరణ్యావాసమున్న సమయంలో భీమసేనుడు ఈ గుహలో ఉన్నట్లు ఆదివాసీలు పేర్కొనడం విశేషం. భీమసేనుడి పెండ్లి సైతం ఇక్కడే జరిగిన్నట్లు పూర్వీకులు చెబుతారు. ఈ గుహలోపల పెద్ద పెద్ద సొరంగ మార్గాలు ఉన్నాయని ఆదివాసీ పెద్దలు చెబుతుంటారు. కటిక చీకటిగా ఉండే ఈ గుహలోకి భక్తులు కాగడాల సాయంతో వెళ్తుంటారు.

### కాగడాల తయారీ ఇలా..

గుహలోకి ప్రవేశించే ముందు ఆదివాసీలు వెలుతురు కోసం ప్రత్యేకంగా కాగడాలను తయారు చేస్తారు. వెదురు కంకలను తీసుకొచ్చి చినచిన్న ముక్కలుగా సిద్ధం చేస్తారు. ఒక పక్కన పూర్తిగా మూసి ఉండగా.. మరో వైపు వొత్తులు పెట్టి అందులో ఆముదం నూనె పోస్తారు. గుహలోకి వెళ్లే సమయంలో కాగడాలను వెలిగించి వాటి వెలుతురులో లోపలికి ప్రవేశిస్తారు. లోపల పారే పవిత్ర జలంతో దేవతలకు స్నానం చేసిన అనంతరం భక్తులు సైతం పుణ్యస్నానాలను ఆచరించి బయటికి వస్తారు. ఆపై పూజలు నిర్వహిస్తారు.



భక్తులకు దర్శనమిచ్చి దేవతతో ఇతర గ్రామానికి వెళ్తున్న ఆదివాసులు